సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



సంతానలేమి సమస్యకు చెక్

సంతానం లేని దంపతులకు చికిత్స కోసం కొత్తగూడెంలో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. 8లో



ఆస్తిపన్ను వసూళ్లలో భేష్

గత ఆర్థిక సంవత్సర ఆస్తి పన్ను గడువు సోమవారంతో ముగియగా జిల్లాలోని మున్సిపాలిటీల్లో బాగానే వసూలయ్యాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
37° / 23°

జిల్లాలో బుధవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం మొదలయ్యే ఎండ తీవ్రత మధ్యాహ్నానికి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం



అంజనేయస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీదేవీ వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన మంగళవారం అమ్మవారి సన్నిధిలో కొలువై ఉన్న ఆంజనేయస్వామికి అర్చకులు పంచామృతాభిషేకం, ఆకు పూజ నిర్వహించారు. అనంతరం ఆలయంలో నాద నీరాజనం, సూక్తి పారాయణం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీచక్రార్చన, లక్ష కుసుమార్చన, శ్రీలలితా సహస్రనామ హవనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారికి నివేదన, హారతి సమర్పించి మంత్రపుష్పం పఠించారు.

రామయ్యకు రూ.14లక్షల విలువైన వెండి కలశాలు



ఈఓ రమాదేవికి కలశాలు అందజేస్తున్న దాత కుటుంబీకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఓ భక్తుడు వెండి కలశాలను మంగళవారం బహూకరించారు. హైదరాబాద్ నగరంలోని సైనిక్‌పురి కాలనీకి చెందిన శ్రీరామ శర్మ–సీతామహాలక్ష్మి దంపతులు స్వామివారికి రూ.14 లక్షల విలువ చేసే తొమ్మిది వెండి కలశాలు చేయించారు. ఒక్కో కలశం కిలో 300 గ్రాములు ఉండగా, వీటిని మంగళవారం ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు. అనంతరం దాతలు కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకోగా, అధికారులు వారికి స్వామివారి జ్ఞాపికలతో పాటు ప్రసాదం అందజేశారు.

మొండికుంట రామాలయంలో ఈసీ కార్యదర్శి పూజలు



ఆలయంలో అశోక్‌కుమార్ తదితరులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట శ్రీ సీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మేకల అశోక్‌కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయగా.. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అశోక్‌కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ మర్రి మల్లారెడ్డి, సభ్యులు కాసరబాద శ్రీనివాస్, కొల్లు మల్లారెడ్డి, మేడవరపు సుధీర్, పాటి మన్మథరెడ్డి, రామగిరి భాస్కర్, భిక్షంరెడ్డి, రణబోతుల రామిరెడ్డి, ప్రతాపరెడ్డి, రాములు, వెంకటరెడ్డి, రామాచారి, లింగయ్య, శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయండి..

రాజ్యసభలో ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: సహకార రంగంలో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి రూ.1,122 కోట్లను కేంద్రప్రభుత్వం కేటాయించడంపై రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు రాజ్యసభలో మంగళవారం ఆయన మాట్లాడారు. త్రిభువన్ సహకార యూనివర్సిటీ ఏర్పాటుకు రూ.500 కోట్లు కేటాయించడమే కాక 284 కేంద్రాల ద్వారా 8లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడం, సహకార సంఘాల ఆధునీకీకరణలో భాగంగా డిజిటలైజేషన్, స్టార్టప్‌లకు ప్రోత్సహించేలా రూ.600 కోట్లు కేటాయించడం ఆశాజనకంగా ఉంటుందని పేర్కొన్నారు. అయితే, ఇందులో తెలంగాణ రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత లభించలేదని ఎంపీ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మాత్రమే శిక్షణ కేంద్రం ఉన్నందున ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్‌లోనూ ఏర్పాటుచేయాలని కోరారు. అలాగే, తెలంగాణలో మిల్లెట్స్ పరిశోధనకు ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలని కేంద్రప్రభుత్వానికి ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి చేశారు.

హెచ్‌సీయూ భూములను కాపాడాలి

హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ముమ్మరంగా పెళ్లి పనులు



సీఎం సెక్టార్‌కు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న కార్మికులు

ముస్తాబవుతున్న మిథిలా స్టేడియం

- ఈ ఏడాది పచ్చగడ్డి లేకుండానే తివాచీలు
- 'ప్రసాద్' నిర్వాకంతో సెక్టార్ పనుల్లో కొంత జాప్యం
- వీవీఐపీ సెక్టార్లు పెంచాలని కలెక్టర్ ఆదేశం



కల్యాణ మండపానికి రంగులు వేస్తున్న దృశ్యం

భద్రాచలం : భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో మిథిలా స్టేడియంలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. స్టేడియమంతా చాందినీ వస్త్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. సీఎంతో పాటు వీవీఐపీ, వీఐపీ, ఇతర భక్తుల కోసం సెక్టార్లను విభజించి బారికేడ్లు ఏర్పాటు చేసి రంగులు కూడా వేశారు. కల్యాణ మండపానికి చుట్టపక్కల సెక్టార్లకు మెష్‌లు ఏర్పాటు చేశారు. కల్యాణ మండపానికి, శిలా తోరణాలకు రంగులు వేస్తున్నారు. విద్యుత్ సమస్య ఏర్పడకుండా ఆ శాఖ డీఈ జీవన్ పనులు పర్యవేక్షిస్తున్నారు. నిరంతర తాగునీటి సరఫరాకు మిషన్ భగీరథ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పెరగనున్న వీవీఐపీ సెక్టార్లు..

ఈ ఏడాది సీఎం రేవంత్ రెడ్డి కల్యాణ మహోత్సవానికి హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, వీవీఐపీల రాక పెరిగే అవకాశం ఉంది. దీంతో వీఐపీ సెక్టార్లను పెంచాలని దేవస్థానం, ఇతర శాఖల అధికారులకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. వీవీఐపీ సెక్టార్ల పెంపు, వారు కూర్చునేందుకు పరుపులు, టవర్ ఏసీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అయితే తన సూచనలకు అనుగుణంగా సెక్టార్లు ఏర్పాటు చేయకపోవడంతో మంగళవారం ఆయన అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సుమారు 30 నిమిషాల పాటు వారికి క్లాస్ తీసుకున్నారు. వీవీఐపీలకు, వీఐపీలకు, సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగొద్దని, సౌకర్యాల ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పచ్చగడ్డికి ఓపెన్ షెడ్ పనుల అడ్డంకి..

ప్రతి ఏడాది కల్యాణానికి రెండు, మూడు నెలలు ముందుగానే స్టేడియం సెక్టార్లను శుభ్రం చేసి పచ్చగడ్డి పెంచుతారు. సెక్టార్ల విభజనకు ముందు ఈ గడ్డిని చదును చేసి వాటిపై ఉత్సవాల రోజున తివాచీలు వేస్తారు. దీంతో భూమి వేడి తగ్గి కల్యాణ, పట్టాభిషేక వీక్షణానికి భక్తులు నాలుగు గంటల పాటు కూర్చున్నా పెద్దగా ఇబ్బంది పడరు. అయితే ఈ ఏడాది స్టేడియంలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓపెన్ షెడ్ పనులు దీనికి ప్రధాన అడ్డంకిగా మారాయి. ఆ స్థలాన్ని అప్పగించాలని దేవస్థానం అధికారులు రెండు నెలల నుంచి అడుగుతున్నా.. ఆ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు అసంపూర్తిగా సాగాయి. పత్రికల్లో కథనం రావడంతో హడావిడిగా పిల్లర్లు పూర్తి చేసి దేవస్థానం అధికారులకు పది రోజుల క్రితం అప్పగించారు. దీంతో అధికారులు పచ్చగడ్డి పనుల జోలికి పోకుండానే సెక్టార్ల విభజన చేస్తున్నారు.



వీకే ఓసీలో ఉత్పత్తి ప్రారంభించండి

- అధికారులకు సింగరేణి సీఎండీ ఆదేశం
- కొత్తగూడెం ఏరియాలో బలరామ్ పర్యటన



సీఎండీ బలరామ్‌తో భేటీ అయిన కూనంనేని తదితరులు

కొత్తగూడెంఅర్బన్ : వీకే ఓసీలో వీలైనంత త్వరగా బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం ఏరియాలో మంగళవారం పర్యటించిన ఆయన.. నూతనంగా అనుమతులు వచ్చిన వీ.కే ఓసీ స్థితిగతులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన లక్ష్యం కంటే అధిక ఉత్పత్తి సాధించడం అభినందనీయమని అన్నారు. లక్ష్య సాధనలో జేవీఆర్ ఓసీ ప్రధాన పాత్ర పోషించిందన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరాల్లోనూ ఇదే ఒరవడి సాగించాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేసిన ఏరియా జీఎం శాలెంరాజుతో పాటు అన్ని విభాగాల ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు, ఏరియా జీఎం శాలెంరాజు, ఇతర విభాగాల జీఎంలు టి.సూర్యనారాయణ, చింతల శ్రీనివాస్, సాయిబాబా, సైదులు, రాధాకృష్ణ, తిరుమలరావు, ఇన్‌చార్జ్ సర్వేయర్ రాఘవేంద్రరావు, ఎస్ఓ టు జీఎం కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ కె. సూర్యనారాయణ రాజు, డీజీఎంలు శివకేశవరావు, యోహాన్, ఏజీఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కల నెరవేర్చండి..

సింగరేణి సంస్థ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల సొంతింటి కల నెరవేర్చేలా చర్యలు చేపట్టాలని, ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు నివసిస్తున్న క్వార్టర్లను వారికే కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు సీఎండీ బలరామ్‌ను కోరారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన సీఎండీతో సమావేశమయ్యారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు నిలువ నీడలేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్మికులకు సొంతింటి పథకాన్ని అమలు చేస్తామని గతంలో ఏఐటీయూసీతో జరిగిన చర్చల్లో అంగీకరించారని గుర్తు చేశారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి హేమచంద్రాపురం వరకు గల రోడ్డు బొగ్గు లారీల రాకపోకలతో శిథిలమైందని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున డబుల్ రోడ్డుగా విస్తరించాలని అన్నారు. డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, బస్టాండ్ సెంటర్ నుంచి త్రిమాత టెంపుల్ వరకు రోడ్డును కూడా విస్తరించి డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగూడెంలో 17 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రతిపాదించామని, అందుకు అవసరమైన స్థలాన్ని సింగరేణి కేటాయించాలని, కొత్తగూడెం, రామవరం ప్రాంతాల్లో ఉన్న కమ్యూనిటీ హాళ్లను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని బలరామ్ దృష్టికి తీసుకొచ్చారు. కాగా, తమ ప్రతిపాదనలపై సీఎండీ సానుకూలంగా స్పందించారని కూనంనేని వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, నాయకులు కె.రాజ్‌కుమార్, కె.సారయ్య, వట్టికొండ మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

సింగరేణి సీఎంఓగా కిరణ్ రాజ్‌కుమార్



కిరణ్ రాజ్‌కుమార్

సింగరేణి (కొత్తగూడెం): కొత్తగూడెం సింగరేణి ప్రధానాస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ)గా డాక్టర్ ఆర్.కిరణ్ రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సీఎంఓగా పనిచేసిన సుజాత సోమవారం ఉద్యోగ విరమణ చేయగా.. రామగుండం –1 ఏరియా ఆస్పత్రిలో అడిషనల్ సీఎంఓగా విధులు నిర్వహిస్తున్న కిరణ్ రాజ్‌కుమార్‌ను సీఎంఓగా నియమించారు.

డీసీసీబీ జీఎంలపై సస్పెన్షన్ ఎత్తివేత

పరతులతో పునర్‌నియామకం, విచారణ కొనసాగింపు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో పనిచేస్తుండగా వచ్చిన ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన ఇద్దరు జనరల్ మేనేజర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర కోఆపరేటివ్ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. రుణమాఫీ, రైతుబీమా ప్రీమియం, ఉద్యోగుల బదిలీలు, ఇంక్రిమెంట్లు, ప్రోత్సాహకాలు తదితర అంశాల్లో అక్రమాలకు పాల్పడ్డారని, పాలకవర్గంతో ప్రమేయం లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని బ్యాంకు డైరెక్టర్లు రాష్ట్ర సహకార బ్యాంకు ఎండీ, సహకార రిజిస్ట్రార్, ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో రుణమాఫీ అంశంపై సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్‌ను, రైతు బీమా ప్రీమియంపై జనరల్ మేనేజర్ ఏ. పద్మావతి, ఉద్యోగుల బదిలీలు, ఇంక్రిమెంట్లు, ప్రోత్సాహకాల విషయంలో మరో జనరల్ మేనేజర్ కె.నర్మదను గత ఆగస్టు, సెప్టెంబర్‌లో సస్పెండ్ చేశారు. ఈనేపథ్యాన విచారణ జరుగుతుండగా, జీఎంలు పద్మావతి, నర్మదను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర సహకార రిజిస్ట్రార్ టస్కాబ్ ఎండీని ఆదేశించారు. ఇందులో పద్మావతిని ఖమ్మం డీసీసీబీలో కాకుండా ఇతర చోట నియమించాలని, నర్మద ఖమ్మం డీసీసీబీలో పనిచేసిన సమయాన ఆరోపణలు ఎదుర్కొంటూ నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యాక సస్పెండ్ కావడంతో అక్కడే జనరల్ మేనేజర్‌గా నియామకానికి అవకాశం ఇచ్చారు. కాగా, ఖమ్మం డీసీసీబీ పరిధిలో 1.69 లక్షల మంది రైతులకు రూ.892 కోట్ల పంట రుణాలు మాఫీ కావాల్సి ఉండగా, కేవలం 68వేల మందికే రూ.274 కోట్లు మాఫీ అయ్యాయి. దీంతో పాటు మరికొన్ని అంశాల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌కు గురైన సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ విషయంలో మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

యథావిధిగా విచారణ

డీసీసీబీ జీఎంలపై సస్పెన్షన్లను ఎత్తివేసినప్పటికీ అక్రమాలపై విచారణ మాత్రం కొనసాగించాలని నిర్ణయించారు. దీంతో నర్మద, పద్మావతి రుణమాఫీ, బీమా ప్రీమియం, బదిలీలు, ఇంక్రిమెంట్లు, ప్రోత్సాహకాల అంశంపై యథావిధిగా విచారణ చేపట్టనున్నారు.

భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలి



ఏర్పాట్లపై చర్చిస్తున్న కమిషనర్, పక్కన పీఓ, ఈఓ తదితరులు

- ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టండి
- అధికారులకు దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ ఆదేశం

భద్రాచలం: శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలకు వచ్చే భక్తులు వేసవిలో ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అధికారులకు సూచించారు. మిథిలా స్టేడియం, ఆలయ పరిసర ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. సెక్టార్ల విభజన, సీఎం, వీవీఐపీ, ఇతర సెక్టార్లలో ఏర్పాట్ల గురించి అధికారులు మ్యాప్ ద్వారా వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఎండల నేపథ్యంలో భక్తులు ఇబ్బంది పడకుండా తాగునీరు, మజ్జిగ, గాలి వీచేలా ఏర్పాట్లు చేయాలని, సకల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. భక్తులు కల్యాణంతో పాటు ఆ తర్వాత మూలమూర్తులను దర్శించుకునేలా చూడాలని, భక్తులందరికీ తలంబ్రాలు, ప్రసాదం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ బి. రాహుల్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, దేవస్థానం ఈఓ రమాదేవి, ఈఈ రవీందర్, ఆర్‌డీఓ దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులంతా కల్యాణాన్ని తిలకించాలి

- ఆ మేరకు ఏర్పాట్లు చేయండి
- ఐదో తేదీ వరకు పనులు పూర్తి కావాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాడ వీధుల వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్, పీఓ రాహుల్ తదితరులు

భద్రాచలం : వీవీఐపీలు, వీఐపీలు, ఉభయ దాతలతో పాటు సామాన్య భక్తులు సైతం స్టేడియంలో ప్రశాంతంగా రామయ్య కల్యాణాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. స్థానిక మిథిలా స్టేడియంలో జరుగుతున్న పనులను ఐటీడీఏ పీఓ బి. రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. సెక్టార్ల విభజనపై అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ఎండ నుంచి ఉపశమనం కలిగించేందుకు మిస్టింగ్ ఫాగ్ విధానాన్ని స్టేడియంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత సేవలు అందించేలా స్వచ్ఛంద సేవా సంస్థల సాయం తీసుకోనున్నట్లు తెలిపారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్లాస్టిక్ వినియోగానికి భక్తులు దూరంగా ఉండాలని కోరారు. శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలని, పట్టణంలో జరుగుతున్న పనులనీ ఐదో తేదీ నాటికి పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. తొలుత సీఎం, వీవీఐపీ సెక్టార్లను గతంలో సూచించిన ప్రకారం పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వీడాలని హితవు పలికారు.

గిరిజన సంస్కృతి అందరికీ పరిచయం కావాలి..

భద్రాచలం వచ్చే పర్యాటకులు, భక్తులందరికీ గిరిజన, ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు పరిచయం కావాలని కలెక్టర్ అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన చిత్రాలు, వస్తువులను పరిశీలించారు. బోటింగ్, ఇతర క్రీడా ప్రదేశాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతి ఖండాంతరాలకు తెలిసేలా గిరిజన మ్యూజియాన్ని శ్రీరామనవమి రోజున ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పీఓ బి.రాహుల్ మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతితో పాటు ఇక్కడికి వచ్చే చిన్నారులు, పెద్దలకు ఆహ్లాదాన్ని పంచేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఆదివాసీ గిరిజనుల వంటకాల రుచి కోసం స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. టూరిజం స్పాట్‌గా మార్చేందుకు అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీఓ దామోదర్ రావు, ఆలయ ఈఓ రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బ్రహ్మయ్య, అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాస్, ఏఓ గన్యా తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ షురూ..



బియ్యం పంపిణీ చేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య (ఇన్‌సెట్) సన్నబియ్యంతో వండిన అన్నం

- రేషన్‌షాపుల వద్ద సందడే సందడి..
- లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందురూరల్ : జిల్లాలోని రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కొందరు డీలర్లు ఉదయం షాపులు తెరిచి పంపిణీ చేయగా, మరికొందరు సాయంత్రం వేళలో లబ్ధిదారులకు అందజేశారు. రేషన్ కార్డు ఉన్న వారందరికీ ఈనెల 1 నుంచి సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ.. కొందరు డీలర్లు అసలు షాపులే తెరవలేదు. కాగా, పంపిణీ చేసిన గ్రామాల్లో సన్నబియ్యం బాగున్నాయంటూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో మిగిలి ఉన్న దొడ్డుబియ్యాన్ని పక్కన పెట్టి ప్రస్తుతం విడుదలైన సన్నబియ్యం మాత్రమే డీలర్లు పంపిణీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రెండూ కలిపి విక్రయించే అవకాశం ఉన్న నేపథ్యంలో లబ్ధిదారులే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

మంచి నిర్ణయం..



రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుని పేదలకు సన్నబియ్యం అందిస్తోంది. దీంతో ఒక్కో కుటుంబానికి నెలకు రూ.1,500 నుంచి రూ.3వేల వరకు ఆదా అయ్యే అవకాశం ఉంది. సన్నబియ్యం పంపిణీతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– మనీష్, రేషన్‌డీలర్

సన్నబియ్యం బాగున్నాయి



రేషన్ షాపుల ద్వారా ఇస్తున్న సన్నబియ్యం బాగున్నాయి. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యం సరిగా ఉండకకపోయేవి. అన్నం తిన్నా అరగకపోయేది. ఇప్పుడు సన్నబియ్యంతో అలాంటి ఇబ్బంది ఉండదు.

– విజయలక్ష్మి, కొత్తగూడెం

మాలాంటి పేదలకు మేలు..



గతంలో రేషన్‌షాపుల్లో బియ్యం తీసుకున్న వారిలో చాలామంది వెంటనే అమ్ముకునేవారు. నేను మాత్రం ప్రతినెలా ఇంటికి తెచ్చుకుని వండుకునేదాన్ని. ఇప్పుడు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం బాగున్నాయి. మాలాంటి పేదలకు ఇలాంటి పథకాలు మేలు చేస్తాయి.

–తాటి బుచ్చమ్మ, బాలాజీనగర్, ఇల్లెందు మండలం

చక్కగా ఉడికింది..



రేషన్‌షాపులో బియ్యం తీసుకున్న వెంటనే వండుకున్నా. బియ్యం కొత్తవే అయినా వండితే చక్కగా ఉడికాయి. బియ్యం నాణ్యత కూడా బాగుంది. సన్నబియ్యం పంపిణీ భవిష్యత్‌లోనూ కొనసాగించాలని కోరుకుంటున్నా.

– చెన్నూరి భాగ్యమ్మ, ఇల్లెందు

ఆనందంగా ఉంది



సన్నబియ్యం కొనలేక ఇంత కాలం రేషన్ షాపులో ఇచ్చిన దొడ్డు బియ్యమే వండుకున్నాం. అన్నం చల్లారితే తినాలంటే ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తుండటం ఆనందంగా ఉంది. ఈ పథకాన్ని ఎప్పటికీ కొనసాగించాలి.

– సయ్యద్ రెహానా బేగం, ఇందిరానగర్, ఇల్లెందు మండలం

గోదారి తీరంలో కోటి దీపోత్సవం



భద్రాచలంలోని పవిత్ర గోదావరి తీరంలో తూర్పు గోదావరి జిల్లా కోరుకొండకు చెందిన కల్యాణ అప్పారావు బృందం ఆధ్వర్యంలో కోటి దీపోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా రామాలయానికి చేరుకున్న సభ్యులు కోటి గోటి తలంబ్రాలు సమర్పించారు. అనంతరం గోదావరి తీరంలో దీపాలు వెలిగించారు. దీపాల మధ్యలో సీతారాముల మూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. –భద్రాచలంటౌన్

క్లుప్తంగా

భద్రాచలంలో హీరో రోషన్ సందడి



బంధువులతో హీరో రోషన్

భద్రాచలంటౌన్: ఇటీవల విడుదలైన చిత్రం కోర్టులో హీరోగా నటించిన, పట్టణానికి చెందిన రోషన్ మంగళవారం భద్రాచలంలో సందడి చేశారు. సినిమా విడుదలై విజయవంతమైన సందర్భంగా సొంత ఊరు వచ్చిన రోషన్‌కు మిత్రులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని మిత్రులు, బంధువుల ఇళ్లకు వెళ్లి పలకరించాడు. అనంతరం పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

14 మందిపై కేసు నమోదు

కారు, 10బైక్‌లు, రూ.60వేల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

టేకులపల్లి: చిత్తూ బొత్తు ఆడుతున్న 14 మందిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. టేకులపల్లి ఎస్‌ఐ పి.సురేష్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల సమీపంలో కొందరు యువకులు చిత్తూ బొత్తు ఆడుతుండగా టాస్క్‌ఫోర్స్, టేకులపల్లి పోలీసులు దాడి చేశారు. మూడ్ పవన్, మూడ్ గణేష్, గుగులోత్ వెంకన్న, మూడ్ భాస్కర్, భూక్యా ద్వాలియా, గుగులోత్ భద్రు, బానోత్ సురేందర్, అంగోత్ తులసీరామ్, చాపల వెంకన్న, జూలూరుపాడుకు చెందిన తేజావత్ నర్సింహా, మస్తాన్, గొడుగు వీరబాబు, జంగం రాము, భూక్యా అజయ్, గుగులోత్ గోపాల్, బాదావత్ శివలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి కారు, 10 బైక్‌లు, రూ.60వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

దారి విషయంలో ఘర్షణ

వేంసూరు: దారి వివాదమై ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటన మండలంలోని జయలక్ష్మీపురంలో మంగళవారం చోటు చేసుకుంది. కొంత కాలంగా జయలక్ష్మీపురం ఎస్సీ కాలనీలో దారి విషయమై వివాదం నెలకొంది. దీంతో అప్పటి తహసీల్దార్, సర్వేయర్ హద్దులు నిర్ణయించారు. అయితే, మంగళవారం ఓ వర్గానికి చెందిన వ్యక్తి గతంలో హద్దులు నిర్ణయించిన దారికి ఫెన్సింగ్ వేశాడు. దీంతో ఎస్సీ కాలనీవాసులు అడ్డుకునేందుకు వెళ్లగా కాలనీకే చెందిన ఇరువర్గాల నడుమ ఘర్షణ చోటు చేసుకుంది. రెండు వర్గాల పరస్పరం దాడులకు దిగగా, ఆతర్వాత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రైలు కిందపడి మృతి

బోనకల్: బోనకల్ రైల్వేస్టేషన్ సమీపాన మంగళవారం రైలు నుంచి కింద పడడంతో గుర్తు తెలియని వ్యక్తి(30) మృతి చెందాడు. ఈమేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కర్రి శ్రీనివాసరావు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

సంతానలేమి సమస్యకు చెక్..

- జిల్లా కేంద్రంలో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటుకు కసరత్తు
- ఇప్పటికే వైద్యవిధాన పరిషత్ అధికారులతో చర్చించిన కలెక్టర్

ఇల్లెందు: ఎంతో మంది పిల్లలు లేక అవస్థలు పడుతున్నారు. సంతానం లేదనే కారణంతో కొందరు దంపతులు విడిపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విభాగంలో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేస్తే ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుందని జిల్లాలోని వైద్య విధాన పరిషత్ అధికారులు భావిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేయాలని కసరత్తు చేస్తున్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, హైదరాబాద్‌లోని హెల్త్ డైరెక్టర్ కూడా ఇక్కడి అధికారులతో చర్చించారు. జిల్లాలోని వైద్య విధాన పరిషత్ పరిధి ఆస్పత్రుల్లో ఇప్పటికే అన్ని సదుపాయాలు కల్పించారు. జిల్లాలో ఏడు డయాలసిస్ సెంటర్లు నెలకొల్పి 53 మిషన్లు అందుబాటులోకి తెచ్చారు. అన్ని ఆస్పత్రుల్లో డెంటల్, ఆర్థో, ఈఎన్‌టీ, గైనకాలజీ, ఫిజియోథెరపీ, బ్లడ్ బ్యాంక్‌లను ఏర్పాటు చేశారు. కానీ, సంతాన సాఫల్య కేంద్రం మాత్రం లేదు. దీనిని కూడా జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని అధికారులు కృషి చేస్తున్నారు.

జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఓ గదిని కేటాయించి అందులో ఈ సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. జిల్లాలో కొత్తగూడెం సర్వజన ఆస్పత్రితోపాటు భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు, అశ్వారావుపేట ఏరియా వైద్యశాలలు, 29 పీహెచ్‌సీలు, 10 యూపీహెచ్‌సీలు, 376 సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో ఏటా వేలాది జంటలు వివాహబంధంలోకి అడుగుపెడుతున్నారు. అందులో కొన్ని జంటలకు సంతానలేమి సమస్య ఎదురవుతోంది. వారి కోసం ఓ ఇద్దరు గైనకాలజిస్టులను అందుబాటులో ఉంచితే ఈ సెంటర్ ద్వారా ఎంతో మందికి వైద్యం అందుతుందని భావిస్తున్నారు.



కొత్తగూడెంలోని సర్వజన ప్రభుత్వాస్పత్రి

ప్రతిపాదనలు పంపుతాం...



జిల్లాలో పలువురు దంపతులు సంతాన లేమి సమస్యతో బాధపడుతున్నారు. వారి కోసం సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించాం. త్వరలో ప్రతిపాదనలు పంపిస్తాం. కేంద్రం అందుబాటులోకి వస్తే జంటలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా పోతుంది. ఆర్థిక భారం తప్పుతుంది.

–డాక్టర్ రవిబాబు, డీసీహెచ్‌ఎస్

ఆస్తిపన్ను వసూళ్లలో సత్తుపల్లి భేష్

- ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ముందంజ
- ఆ తర్వాత స్థానంలో ఇల్లెందు
- కేవలం 52శాతంతో జాబితాలో చివరన వైరా

సత్తుపల్లిటౌన్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూళ్ల గడువు సోమవారంతో ముగిసింది. ఈనేపథ్యాన ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పరిశీలిస్తే సత్తుపల్లి ముందంజలో నిలిచింది. చివరిరోజు వరకు మున్సిపాలిటీ మేనేజర్ సహా రెవెన్యూ యంత్రాంగమంతా పన్ను వసూళ్లలో నిమగ్నం కావడం.. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఆరు రోజుల ముందు ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్ పథకం ద్వారా పన్ను వడ్డీపై 90 శాతం రాయితీని ప్రకటించడంతో బకాయిదారులకు మెరుగైన వసూళ్లు నమోదయ్యాయి. అంతేకాక ఆస్తి పన్ను చెల్లించకుండా మొండికేసిన వారికి జప్తు నోటీసులు జారీ చేయడం.. నల్లా కనెక్షన్లు తొలగిస్తామన్న హెచ్చరికలతో చాలా మంది మొండి బకాయిదారులు సైతం పన్ను చెల్లించారు.



సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం

వసూళ్లు ఇలా...

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పరిశీలిస్తే సత్తుపల్లిలో రూ.4.91 కోట్లకు రూ.4.26 కోట్లు, వైరాలో రూ.4.06 కోట్లకు రూ.2.13 కోట్లు, మధిరలో రూ.2.56 కోట్లకు రూ.1.96 కోట్లు వసూలైంది. కొత్తగూడెం మున్సిపాలిటీలో రూ.7.93 కోట్లకు రూ.5.86 కోట్లు, మణుగూరులో రూ.2.42 కోట్లకు రూ.1.50 కోట్లు, పాల్వంచలో రూ.6.29 కోట్లకు రూ.4.13 కోట్లు, ఇల్లెందులో రూ.2.67 కోట్ల పన్ను డిమాండ్‌కు గాను రూ.2.20 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేయగలిగారు.

గత ఏడాదితో పోలిస్తే మెరుగు

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 85 శాతం పన్నులు వసూలయ్యాయి. అయితే, 2024–25లో 86.76 శాతం వసూలవడంతో గత ఏడాది కంటే మెరుగైంది. పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకునేలా నెల ముందు నుంచే స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ రోజువారి సమీక్షలు చేస్తూ.. మొండిబకాయిదారులతో మాట్లాడడంతో సత్ఫలితాలు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో 86.76 శాతంతో సత్తుపల్లి ముందంజలో నిలువగా.. వైరా మున్సిపాలిటీలో కేవలం 52.46 శాతమే వసూలు కాగా చివరి స్థానంలో నిలిచింది.

మున్సిపాలిటీ	ఆస్తి పన్ను వసూళ్లు (శాతం)
సత్తుపల్లి	86.76
ఇల్లెందు	82.40
మధిర	75
కొత్తగూడెం	73.90
పాల్వంచ	65.66
మణుగూరు	61.98
వైరా	52.46

ఆర్టీసీ బస్సు – లారీ ఢీ

- చిన్నారి సహా పది మందికి గాయాలు
- వైరా రింగ్ సెంటర్‌లో ప్రమాదం

వైరా: నిండా ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు – లారీ ఢీకొన్న ఘటనలో పది మందికి గాయాలయ్యాయి. ఇందులో ఓ చిన్నారి కూడా ఉన్నాడు. వైరాలోని రింగ్ రోడ్డు సెంటర్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో ఖమ్మం నుంచి మణుగూరుకు వెళ్తోంది. వైరా బస్టాండ్‌లో నుండి రింగ్ రోడ్డులోకి తిరుగుతున్న సమయాన తల్లాడ వైపు నుండి ఖమ్మం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో గుండాల మండలం వేపలగడ్డ గ్రామానికి చెందిన వరమ్మ, భారతికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే, భారతి మూడేళ్ల బిడ్డ దేవిక్ రెండు చేతి వేళ్లు విరగడమే కాక తలకు తీవ్ర గాయాలయ్యాయి. దేవికకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో తల్లి భారతి, నాయనమ్మ వరమ్మ ఖమ్మం తీసుకెళ్లి ఆస్పత్రిలో చూపించారు. ఆతర్వాత గుండాల వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో కొత్తగూడెం వెళ్లాలని మణుగూరు డిపో బస్సు ఎక్కగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో వీరు ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో వైరాలో చికిత్స అనంతరం మళ్లీ ఖమ్మం తరలించారు. ఇక కొత్తగూడేనికి చెందిన రియాజ్, రుద్రంపూర్‌కు చెందిన ప్రేమ్, పాల్వంచకు చెందిన శ్రావ్యకు, తల్లాడకు చెందిన జనార్దన్, భవాని, మోక్షిత్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు బయటకు తీసి చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



బస్సు నుంచి క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం

మణుగూరు డిపో ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. ఖమ్మం నుంచే వేగంగా, నిర్లక్ష్యంగా బస్సు నడిపాడని, దీంతో వైరాలో ప్రమాదం జరిగిందని అటు ప్రయాణికులు, ఇటు స్థానికులు వెల్లడించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న వాహనాలు, నిందితుడితో పోలీసులు

ఖమ్మంక్రైం: జల్సాలకు అలవాటు పడి ఇళ్లలో, బైక్‌లను చోరీ చేస్తున్న వ్యక్తిని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. భద్రాచలానికి చెందిన కోడి శేఖర్ అలియాస్ జంపన్న ఖమ్మం వన్ టౌన్, టూ టౌన్, ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మరో వ్యక్తితో కలిసి చోరీలకు పాల్పడుతున్నాడు. దీంతో నిఘా పెట్టిన పోలీసులకు వెలుగుమట్ల సమీపంలోని పంచాక్షరి కాలనీలో ఉన్నట్లు సమాచారం అందడంతో వెళ్లి శేఖర్‌ను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పారిపోయాడు. నాలుగు బైకులు, 10 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడి అరెస్ట్‌లో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు హరికృష్ణ, బోరయ్యను సీపీ సునీల్‌దత్, ఏసీపీ రమణమూర్తి అభినందించారు.

హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి

మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం ఆపాలని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం పోస్టాఫీస్ ఏరియా అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలను చేశారు. అనంతరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ తెలంగాణలో ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి రాక్షస పాలన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేంద్రరావు, మాజీ కౌన్సిలర్లు అంబుల వేణు, రుక్మాంగదర్ బండారి, దూడల బుచ్చయ్య, అన్వర్ పాషా, అంగోతి మోతి, బత్తుల మధు, చందు, సత్యనారాయణ, నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు

ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు రూరల్: ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేసిందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలపై కేసు నమోదు చేయాలని ట్రైనీ ఎస్సై మనీషాకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. హామీలు అమలు చేసేవరకు ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహరావు, నాయకులు వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, నూకారపు రమేష్, ముత్యంబాబు, రవి, సృజన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



ట్రైనీ ఎస్సైకి ఫిర్యాదు అందజేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు తదితరులు

పదవిలో కొనసాగే అర్హతలేదు

మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందు: ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కలకు పదవుల్లో కొనసాగే అర్హత లేదని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, మాజీ గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్ పేర్కొన్నారు. మంగళవారం ఇల్లెందు జగదాంబా సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐలు సందీప్‌కుమార్, బి. సూర్యలకు ఫిర్యాదు చేశారు. అనంతరం స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థులను రాత్రికి రాత్రే అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే అరెస్టులు ఎమర్జెన్సీ అన్నట్లు నిరూపిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సిలివేరు సత్యనారాయణ, లకావత్ దేవీలాల్, జేకే శ్రీనివాస్, పరుచూరి వెంకటేశ్వర్లు, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, భావ్ సింగ్‌నాయక్, దాస్యం ప్రమోద్, నెమల ధనలక్ష్మి, సరిత, అబ్దుల్ నబీ, ఆదూరి రవి, హరిప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వేధింపుల కేసు నమోదు

పాల్వంచరూరల్: తాగి వచ్చి మానసికంగా, శారీరకంగా భార్యను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని ఉల్వనూరు గ్రామానికి చెందిన బి.లావణ్య తన భర్త శివ తాగివచ్చి వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ.సురేశ్ తెలిపారు.

దాడి ఘటనలో..

పాల్వంచరూరల్: దాడి ఘటనలో యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దొడ్లో చెత్త పోస్తున్నావంటూ గత నెల 30న గుగులోతు కృష్ణకిషోర్ అనే వ్యక్తి దాడి చేసి కొట్టాడని మండల పరిధిలోని ఇల్లెందులపాడుతండాకు చెందిన గుగులోతు శ్రీలత మంగళవారం ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ.సురేశ్ తెలిపారు.

భద్రాచలంలో..

భద్రాచలంఅర్బన్: భార్యను వేధిస్తున్న వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని రామాలయం వీధికి చెందిన శివరంజన్‌తో సౌజన్యకు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆమె స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు వైద్యశాలలో నర్సుగా పని చేస్తోంది. భర్త కొంతకాలంగా శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేసీబీ, ట్రాక్టర్లు సీజ్

దమ్మపేట: అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న జేసీబీని, మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం మండలంలోని పార్కలగండి గ్రామ శివారులో అక్రమంగా జేసీబీతో తవ్వి, ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తున్నారనే సమాచారం అందింది. దీంతో రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ, ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమ మైనింగ్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ వాణి తెలిపారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్

హెల్త్ సూపర్‌వైజర్ దారుణ హత్య

- మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఘటన
- మృతుడిది చర్ల.. దంతాలపల్లిలో విధులు

మహబూబాబాద్ రూరల్: ఓ గురుకులంలో విధులు నిర్వర్తిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం శివారు బోరింగ్‌తండా సమీపాన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మహబూబాబాద్ రూరల్ సీఐ పి.సర్వయ్య వెల్లడించిన వివరాలు... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చెందిన తాటి పార్థసారథి(42) భద్రాచలంలోని జగదీశ్ కాలనీలో నివాసముంటున్నాడు. ఆయనకు 11 ఏళ్ల క్రితం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రేకపల్లికి చెందిన స్వప్నతో వివాహం జరగగా, దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాపిల్లలు భద్రాచలంలోనే ఉంటుండగా, పార్థసారథి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మహాత్మాజ్యోతిబాపూలే గురుకులంలో ఏడాదిగా హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తూ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమాన ఉగాది, రంజాన్ సెలవులకు శుక్రవారం సాయంత్రం భద్రాచలం వెళ్లి సోమవారం సాయంత్రం తిరిగి బయలుదేరాడు. గది యజమానికి ఫోన్ చేసి గేటు వేయొద్దని చెప్పాడు. కాగా, మంగళవారం తెల్లవారుజామున బోరింగ్‌తండా సమీపాన మిరప చేనులో తల ఛిద్రమైన ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్, డీఎస్పీ ఎస్.తిరుపతిరావు, సీఐ పి.సర్వయ్య, ఎస్సై వి.దీపిక అక్కడకు చేరుకున్నారు. సంఘటనా స్థలంలో దొరికిన ఆధారాలతో మృతుడిని గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్స్, క్లూస్‌టీం బృందాలు వచ్చి పరిశీలించగా, అధికారులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.





ఘటనాస్థలిలో పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్, పోలీసులు (ఇన్‌సెట్) తాటి పార్థసారథి (ఫైల్)

ఏడాది క్రితం కూడా దాడి..

పార్థసారథి హత్య సమాచారం తెలియడంతో ఆయన సోదరి మద్దుల హేమవరలక్ష్మి, బావ శివప్రసాద్ చేరుకుని బోరున విలపించారు. ఈసందర్భంగా హేమవరలక్ష్మి మాట్లాడుతూ తన సోదరుడిపై ఏడాది క్రితం కూడా దాడి జరిగిందని తెలిపారు. మరదలు స్వప్నకు వివాహేతర సంబంధం ఉండగా ఈ కారణంతోనే హత్య జరిగి ఉండొచ్చని ఫిర్యాదు చేశారు. కాగా, బీసీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్‌సీఓ రాజ్‌కుమార్ వివరాలు ఆరా తీశారు.

కీలకం కానున్న హెల్మెట్

పార్థసారథి హత్యాస్థలం వద్ద లభ్యమైన హెల్మెట్ కేసు దర్యాప్తులో కీలకం కానున్నట్లు సమాచారం. నిందితుల రాకపోకలు, వాళ్లు వాడిన ద్విచక్ర వాహనం ఆచూకీపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులుగా గుర్తించిన వారు ద్విచక్రవాహనంపై రాగా, వాహనం నడిపిన వ్యక్తి తెలుపురంగు హెల్మెట్ ధరించాడని, ఘటనా స్థలిలోనే అదేరంగు హెల్మెట్ లభించడంతో ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇక పార్థసారథి హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనంపై ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించారు. ఈమేరకు భద్రాచలం నుంచి ఘటనాస్థలి వరకు రహదారుల వెంట ఉన్న సీసీ ఫుటేజీలు సేకరించడంపై దృష్టి సారించారు.

విజయకాలనీలో విషాద ఛాయలు

చర్ల: తాటి పార్థసారథి మృతితో చర్లలోని విజయకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు లక్ష్మీకాంత, మనోహర్. తండ్రి ఆర్మీలో పని చేసి రిటైర్ అయ్యాక కరోనా సమయంలో మృతి చెందాడు. తల్లి వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్‌ఎంగా పని చేసి ఉద్యోగ విరమణ పొందింది. చర్లలోని విజయకాలనీలో ఇంటిని విక్రయించుకుని మూడేళ్ల క్రితం భద్రాచలంలో ఇల్లు కొనుగోలు చేశారు. కాగా, పార్థసారథి సోదరుడిని పదిహేనేళ్ల క్రితం ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హతమార్చారు.

పాముకాటుతో బాలుడి మృతి



సాయి సుకుమార్ (ఫైల్)

ములకలపల్లి: పాము కాటువేయడంతో బాలుడు మృతి చెందిన ఘటన జగన్నాథపురంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వ్యాపారి బొల్లిపల్లి సురేశ్, హేమలత దంపతుల కుమారుడు సాయి సుకుమార్ (11) ఇంటి ఆవరణలో బాల్‌తో ఆడుకుంటున్నాడు. కాగా బాల్ సమీపంలోని రంధ్రంలోకి వెళ్లింది. సాయిసుమార్ బాల్ తీస్తుండగా చేతిపై ఏదో కుట్టింది. దీంతో బాలుడు కొద్దిసేపటి తర్వాత కుటుంబీకులకు విషయం తెలిపాడు. వారు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా వాంతులై పరిస్థితి విషమించింది. పాల్వంచ ఆస్పత్రికి చేరాక పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందాడని తెలిపారు. తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

బెల్లం, పటిక స్వాధీనం

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన వర్షిత్‌కు చెందిన కిరాణా దుకాణంలో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. నాటుసారాకు వినియోగించే 90 కిలోల బెల్లం, 8 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ, తెలిపారు.

జామాయిల్ తోట దగ్ధం

బూర్గంపాడు: మండల పరిధిలోని ఇరవెండి గ్రామానికి చెందిన రైతు రామకృష్ణ సాగు చేసిన జామాయిల్ తోట ప్రమాదవశాత్తు పూర్తిగా దగ్ధమైంది. మంగళవారం మధ్యాహ్నం జామాయిల్ తోటలో మంటలు వస్తుండటాన్ని గమనించిన ఇరుగు పొరుగు రైతులు రామకృష్ణకు సమాచారమిచ్చారు. ఆయన అక్కడకు చేరుకునే సరికే తోట మొత్తం కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులే జామాయిల్ తోటకు నిప్పు పెట్టి ఉంటారని బాధితరైతు ఆరోపిస్తున్నారు. జామాయిల్ తోట కాలిపోవటంతో సుమారు రూ 8 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు.